
సాక్షి
కామారెడ్డి
శుక్రవారం । 14 । మార్చి । 2025



శారీరకంగా, మానసికంగా..
విద్యార్థులు శారీరకంగా, మానసికంగా ధృడంగా ఉంటే భవిష్యత్ బాగుంటుందని జిల్లా వైద్యశాఖాధికారి చంద్రశేఖర్ అన్నారు.
- 8లో ▸



గరిష్ఠం/కనిష్ఠం
38.6 /18.2

వాతావరణం
ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి చలి తీవ్రత తక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడొద్దు



నస్రుల్లాబాద్(బాన్సువాడ): వేసవిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడకుండా సిబ్బంది పని చేయాలని విద్యుత్ శాఖ ఎస్‌ఈ శ్రావణ్‌కుమార్ అన్నారు. బీర్కూర్, నస్రుల్లాబాద్ మండల కేంద్రాల్లోని సబ్ స్టేషన్‌లను గురువారం ఆయన తనిఖీ చేశారు. సింగిల్, త్రీ ఫేస్ విద్యుత్ సరఫరా వివరాలు తెలుసుకున్నారు. ట్రాన్స్‌ఫార్మర్‌ల పని తీరును పరిశీలించారు. వినియోగదారులకు అందుబాటులో ఉండాలని సిబ్బందిని ఆదేశించారు. ఉన్నతాధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటేనే క్షేత్ర స్థాయి సిబ్బంది పని చేస్తారన్నారు. ఆయన వెంట డీఈ ఎంఆర్‌టీ నాగరాజు, బాన్సువాడ డీఈ గంగాధర్, ఏఈ ఎస్‌పీఎం దేవీదాస్, సబ్ ఇంజినీర్ రంజిత్, నరేశ్, సిబ్బంది రఘు, పీరాజీ ఉన్నారు.

జిల్లా జడ్జిని కలిసిన ఎస్పీ



కామారెడ్డి టౌన్: జిల్లా ఎస్పీగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన రాజేశ్‌చంద్ర జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి వీఆర్‌ఆర్ వరప్రసాద్‌ను గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. న్యాయమూర్తికి ఎస్పీ మొక్కను అందజేశారు. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలపై చర్చించారు.

డీఎస్పీ శ్రీనివాసులు బదిలీ



ఎల్లారెడ్డి : ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు గురువారం బదిలీ అయినట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. శ్రీనివాసులు హైదరాబాద్ డీజీపీ కార్యాలయానికి బదిలీ కాగా, ఆయన స్థానంలో సూర్యాపేట సైబర్ క్రైం డీఎస్పీగా ఉన్న సుంకరి శ్రీనివాస్‌రావు రానున్నట్లు వారు తెలిపారు.

సివిల్ సర్వీసెస్ క్రికెట్ టోర్నీకి ఎంపిక



మాచారెడ్డి: మండలంలోని చుక్కాపూర్ గ్రామానికి చెందిన వేల్పూరి ప్రదీప్ సివిల్ సర్వీసెస్ క్రికెట్ టోర్నమెంట్‌కు ఎంపికైనట్లు గ్రామస్తులు గురువారం తెలిపారు.ఈ నెల 17వ తేదీ నుంచి 25 వరకు ఢిల్లీలో కొనసాగనున్న క్రికెట్ టోర్నీలో ప్రదీప్ పాల్గొంటాడన్నారు. ఈ సందర్భంగా ప్రదీప్‌ను గ్రామస్తులు అభినందించారు.

316 మంది విద్యార్థుల గైర్హాజరు

కామారెడ్డి టౌన్: జిల్లాలో ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు కొనసాగుతున్నాయి. గురువారం నిర్వహించిన ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షకు 38 కేంద్రాల్లో 8423 మంది విద్యార్థులకుగాను 8107 మంది హాజరు కాగా, 316 మంది గైర్హాజరయ్యారు. ఇందులో 7130 మంది జనరల్ విద్యార్థులకుగాను 6915 మంది హాజరు కాగా, 215 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ కోర్సుల్లో 1293 మందికి గాను 1192 మంది హాజరు కాగా, 101 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పరీక్షలను జిల్లా ఇంటర్ నోడల్ అధికారి షేక్ సలాం పర్యవేక్షించారు.

కామారెడ్డి ఆర్టీసీ డీఎం బదిలీ

- నూతన డీఎం కరుణశ్రీ

కామారెడ్డి టౌన్: కామారెడ్డి ఆర్టీసీ డిపో మేనేజర్ ఇందిర హైదరాబాద్‌లోని బస్‌భవన్‌లో అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్(ఏటీఎం)గా బదిలీ అయ్యారు. 2023 ఆగస్టులో కామారెడ్డి డిపో మేనేజర్‌గా ఇందిర బాధ్యలు చేపట్టారు. పరిగి డిపో మేనేజర్‌గా పనిచేసిన కరుణశ్రీ నూతన డీఎంగా రానున్నారు. నాలుగు రోజుల్లో ఆమె విధుల్లో చేరనున్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

బాన్సువాడ: బాన్సువాడ ఆర్టీసీ బస్ డిపోలో శుక్రవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు డీఎం సరితాదేవి తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు.



హోలీ వేడుకల్లో భాగంగా జిల్లాలో గురువారం రాత్రి కామదహనం నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని మున్సిపాలిటీ కూడలిలో ఆర్యసమాజ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వేదమంత్రాల మధ్య కామదహన యజ్ఞం చేశారు. ఎండుకొబ్బరి, బెల్లం, ఖర్జూరాలు, ఎండు తులసి, శనగలు, నవధాన్యాలు సమర్పించారు. హోలీ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించేందుకు జిల్లా వాసులు ఏర్పాట్లు చేసుకున్నారు. చిన్నాపెద్ద తేడాలేకుండా హోలీ సంబురాల్లో మునిగి తేలనున్నారు. – కామారెడ్డి అర్బన్

మూల్యాంకనం అక్కడేనా..

- టెన్త్, ఇంటర్ స్పాట్‌కు నిజామాబాద్ వెళ్లాల్సిందే
- జిల్లా ఏర్పడి పదేళ్లు కావొస్తున్నా..
- ఇక్కడే ఏర్పాటు చేయాలంటున్న విద్యాభిమానులు



సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : కామారెడ్డి జిల్లా ఏర్పడి పదేళ్లు కావొస్తున్నా టెన్త్, ఇంటర్ స్పాట్ వ్యాల్యుయేషన్ కేంద్రాలు ఏర్పాటు కాలేదు. దీంతో ఆయా పరీక్షా పత్రాల స్పాట్ కోసం ఉపాధ్యాయులు, అధ్యాపకులు నిజామాబాద్‌కు వెళ్లాల్సి వస్తోంది. పరీక్షాపత్రాల మూల్యాంకనానికి అవసరమైన సౌకర్యాలతో ఉన్న పాఠశాలలు, కళాశాలలు స్థానికంగా అందుబాటులో ఎన్నో ఉన్నాయి. దశాబ్దాల కాలంగా ఉమ్మడి జిల్లాలో కొనసాగుతున్న స్పాట్ వ్యాల్యుయేషన్‌ను అలాగే కొనసాగిస్తున్నారు. కామారెడ్డి జిల్లాకు చెందిన ఆయా సబ్జెక్టు ఉపాధ్యాయులు, అధ్యాపకులు స్పాట్ వ్యాల్యుయేషన్ కొనసాగినన్ని రోజులు నిజామాబాద్ జిల్లా కేంద్రానికి వెళ్లాల్సి వస్తోంది. స్థానికంగాకే కేంద్రాలు ఉంటే ఇక్కడే ఉండి మూల్యాంకనం డ్యూటీ చేయొచ్చని, రాకపోకలకు ఇబ్బందులు తప్పేవని పలువురు అభిప్రాయపడుతున్నారు.

జిల్లా ఏర్పాటైన తరువాత దాదాపు అన్ని కార్యాలయాలు కామారెడ్డిలో ఏర్పాటు చేశారు. ఉమ్మడి జిల్లాలో మిగిలినవి ఒకటి అర మాత్రమే. దీనికితోడు జోన్ కూడా మారిపోయింది. ఇలాంటి సమయంలో కామారెడ్డిలో ఇంటర్, టెన్త్ స్పాట్ కేంద్రాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.


కామారెడ్డి జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలన్నింటిలో కలిపి పదో తరగతి పరీక్షలకు 12,579 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. వాళ్ల రాసిన పత్రాలన్నింటినీ నిజామాబాద్‌కు తరలిస్తారు. అక్కడే మూల్యాంకనం జరుగుతుంది. మూల్యాంకనం కోసం వందలాది మంది సబ్జెక్టు టీచర్లు నిజామాబాద్‌కు వెళ్లాల్సి ఉంటుంది. ఇక్కడే మూల్యాంకనం కేంద్రం ఏర్పాటు చేస్తే ఇబ్బందులు ఉండవని అంటున్నారు. అలాగే ఇంటర్‌లో ఫస్టియర్ విద్యార్థులు 8,743 మంది, సెకండియర్‌లో 9,729 మంది రాస్తున్నారు. అంటే 18,472 మంది విద్యార్థులు రాసిన జవాబు పత్రాలను నిజామాబాద్‌కు తరలించాల్సి ఉంటుంది. ఇక్కడే మూల్యాంకన కేంద్రం ఏర్పాటు చేస్తే తరలింపు సమస్యతోపాటు అధ్యాపకులు వెళ్లివచ్చే ఇబ్బందులూ తప్పుతాయి.

ప్రజాప్రతినిధులు చొరవ చూపాలి

కామారెడ్డి జిల్లా ఆవిర్భవించి పదేళ్లు కావొస్తోంది. అయినప్పటికీ మూల్యాంకన కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం విస్మయానికి గురిచేస్తోంది. జిల్లా అధికారులంతా ఇక్కడే ఉన్న నేపథ్యంలో, అవసరమైన సౌకర్యాలు కూడా ఉన్నందున ఇక్కడే ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. జిల్లా కేంద్రంలో మూల్యాంకన కేంద్రాలు ఏర్పాటు చేసే విషయంలో జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు చొరవ చూపాల్సిన అవసర ం ఉంది. ఇక్కడే మూల్యాంకనం జరిగితే ఎన్నో వ్యయ ప్రయాసాలు తప్పుతాయని అంటున్నారు.

అటకెక్కిన పశుబీమా

- పాడి రైతులకు కరువైన ధీమా
- పశువులు మృత్యువాత పడి నష్టపోతున్న దుస్థితి
- పథకాన్ని పునరుద్ధరించాలని వేడుకోలు



బాన్సువాడ : పాడి రైతులకు ధీమా కల్పించాల్సిన పశుబీమా పడకేసింది. పశుబీమా పథకం అటకెక్కడంతో పాడి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. పశు పోషణపై ఆధారపడిన రైతులు వేర్వేరు కారణాలతో అవి మృతి చెందిన సమయంలో తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రస్తుతం మేలు రకం జాతి పశువుల కొనుగోలుకు రూ.లక్షలు వెచ్చించాల్సి వస్తోంది. ప్రమాదాల బారిన పడి పాడి పశువులు చనిపోతే రైతులు ఆర్థికంగా కుదేలవుతున్నారు.

ఆరేళ్లుగా నిలిచిన పథకం

2017–18 వరకు పాడి పశువులకు బీమా పథకం అమలైంది. ఆ తరువాత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ పథకాన్ని పట్టించుకోవడం లేదు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి వ్యవసాయం, పాడి పరిశ్రమే ప్రధాన ఆధారం. ప్రకృతి వైపరీత్యాలు, కరువు సమయంలో పాడి పశువులు ఎన్నో మృత్యువాత పడ్డాయి. రూ.లక్షలు వెచ్చించి పశువులు కొనుగోలు చేసిన పాడి రైతులు బీమా సౌకర్యం లేక ఆర్థికంగా చతికిల పడుతున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా బీమాను పునరుద్ధరించాలని కోరుతున్నారు.

జిల్లాలో పశు సంపద	
ఆవులు, ఎద్దులు	64,171
గేదెలు	83,304
పందులు	5000
గొర్రెలు	5,72,000
మేకలు	1,63,000

రెండు గేదెలు మృతి చెందాయి



బీర్కూర్ మండలం చించోలిలో పాడి పరిశ్రమ ఉంది. ఇప్పటి వరకు రెండు గేదెలు మృత్యువాత పడ్డాయి. ఒక్కో గేదె రూ.లక్ష 40 వేలు పెట్టి కొన్నాం. దాదాపు రూ.3 లక్షల వరకు నష్టపోయాం. పశువులకు బీమా లేకపోవడంతో తీవ్రంగా నష్టపోయాం. బీమా సౌకర్యం ఉంటే ఇంత ఇబ్బంది ఉండేది కాదు. – బొగ్గుల రాములు, చించోలి

బీమా గురించి అడుగుతున్నారు

చాలా మంది రైతులు పశు బీమా గురించి అడుగుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిపి గతంలో బీమా కోసం ఏజెన్సీకి అప్పగించారు. 2017–18 నుంచి పశు బీమా అమలు కావడం లేదు. రైతుల విన్నపాలను ప్రభుత్వానికి నివేదించాం.
– సంజయ్‌కుమార్, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి

ధాన్యం కొనుగోళ్లకు ఏర్పాట్లు చేయాలి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

- మొత్తం 424 కేంద్రాల ఏర్పాటు
- సేకరణ, రవాణాలో ఇబ్బందులు రావొద్దు
- అధికారులతో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి టౌన్: ధాన్యం కొనుగోళ్లకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. గురువారం కలెక్టరేట్ మినీ సమావేశ హాలులో పౌర సరఫరాల, వ్యవసాయ, పోలీసు, రవాణా, మార్కెటింగ్, సహకార, తదితర శాఖల అధికారులతో ధాన్యం కొనుగోళ్లపై సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో రబీ సీజన్‌లో 2,61,110 ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారని, ఇందులో 57,445 ఎకరాల్లో సన్నరకం, 2,03,665 ఎకరాల్లో దొడ్డు రకం ఉందన్నారు. కాగా 4,88,796 మెట్రిక్ టన్నుల దొడ్డు రకం, 1,32,121 మెట్రిక్ టన్నుల సన్న రకం ధాన్యం దిగుబడి వచ్చే అవకాశం ఉందని తెలిపారు. జిల్లాలో ధాన్యం కొనుగోళ్లకు 424 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని, అందులో 27 కేంద్రాలు మహిళా సంఘాలు, 397 కేంద్రాలు పాక్స్ నిర్వహిస్తాయన్నారు. సన్న రకం ధాన్యం సేకరణకు 63 కేంద్రాలు, దొడ్డు రకం సేకరణకు 334 కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్, ఆటోమేటిక్ ధాన్యం శుభ్రపరిచే, తేమ కొలిచే యంత్రాలు, తూకం వేసే స్కేల్, పాడి డ్రయ్యర్స్, గన్నీ సంచులు తదితర వాటిని అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ధాన్యం రవాణాలో అంతరాయం ఏర్పడకుండా వాహనాలను సమకూర్చాలని, మే చివరి వారంలో వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో ముందస్తు ఏర్పాటు చేయాలన్నారు. వాతావరణ పరిస్థితుల వివరాలను రైతులకు తెలపాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వి విక్టర్, అదనపు ఎస్పీ నరసింహారెడ్డి, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ రాజేందర్, జిల్లా రవాణా అధికారి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి తిరుమల ప్రసాద్, జిల్లా మార్కెటింగ్ అధికారిని రమ్య, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శి సంతకం ఫోర్జరీ

- టాక్స్ రసీదులు, ధ్రువీకరణ పత్రాలు తయారీ
- దోమకొండ మండల కేంద్రంలో వెలుగుచూసిన ఘటన



దోమకొండ: గ్రామ పంచాయతీ కార్యదర్శి సంతకాన్ని ఇద్దరు వ్యక్తులు ఫోర్జరీ చేసిన ఘటన దోమకొండలో వెలుగుచూసింది. సదరు వ్యక్తులు పంచాయతీ టాక్స్ రసీదులు, ధ్రువీకరణ పత్రాలు తయారు చేసి వాటిపై కార్యదర్శి సంతకం చేశారు.

వెలుగు చూసిందిలా..

గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తన కుటుంబ అవసరాల నిమిత్తం కామారెడ్డిలోని ప్రైవేట్ ఫైనాన్స్‌లో బంగారు ఆభరణాలను తాకట్టుపెట్టి రుణం తీసుకున్నాడు. అప్పటికే దోమకొండకు చెందిన మరొకరి వద్ద సదరు వ్యక్తి అప్పు తీసుకుని ఉన్నాడు. తనకు బాకీ ఉండి ఫైనాన్స్‌లో బంగారం తాకట్టు పెట్టిన విషయం తెలుసుకున్న అప్పు ఇచ్చిన వ్యక్తి బంగారాన్ని తాను తీసుకొచ్చుకోవాలని ప్లాన్ చేశాడు. తనకు బాకీ ఉన్న వ్యక్తికి సంబంధించి ఇంటి వివరాలతో పంచాయతీ ధ్రువీకరణపత్రం, టాక్స్ రసీదు తయారు చేసి వాటికి ఆధార్‌కార్డు జత చేసి వాటిపై పంచాయతీ కార్యదర్శి సంతకాలు చేసి ఫైనాన్స్‌లో ఇచ్చాడు. బంగారం పెట్టి రుణం తీసుకున్న వ్యక్తి తనను పంపించాడని నమ్మించి బంగారం తీసుకు వెళ్లిపోయాడు. కొద్ది రోజుల తరువాత బంగారంపై రుణం తీసుకున్న కుటుంబసభ్యులు ఆభరణాల కోసం ఫైనాన్స్‌కు వెళ్లడంతో అసలు విషయం వెలుగుచూసింది. వెంటనే వారు పంచాయతీ కార్యాలయానికి రాగా, తన సంతకాలు ఫోర్జరీ అయ్యాయని తెలుసుకుని కార్యదర్శి యాదగిరి విస్తుపోయి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

మరో వ్యక్తి వద్ద పంచాయతీ బిల్లు బుక్కులు

అదేవిధంగా గ్రామానికి చెందిన మరో యువకుడు సైతం పంచాయతీ బిల్లు బుక్కులు, ధ్రువీకరణ పత్రాలు తయారు చేసి కొంతమందికి ఇచ్చినట్లు తెలిసింది. నకిలీ బిల్లులు, ధ్రువీకరణపత్రాలతో పలువురు రిజిస్ట్రేషన్లు సైతం చేసుకున్నట్లు సమాచారం. ఇటీవల రిజిస్ట్రేషన్ చేసిన ఓ డ్యాక్యుమెంట్ తన వద్దకు రాగా, సంతకం తనది కాదని గుర్తు పట్టిన పంచాయతీ కార్యదర్శి దీనిపై ఆరా తీయగా, గ్రామానికి చెందిన వ్యక్తి నకిలీ ధ్రువీకరణ పత్రాలు, రసీదులు ఇచ్చాడని తేలింది. వెంటనే కార్యదర్శి సదరు యువకుడికి ఫోన్ చేసి ప్రశ్నించగా.. 'అవును చేసింది నేనే ఏం చేసుకుంటారో చేసుకోండి' అంటూ దబాయించడం గమనార్హం. దీనిపై పంచాయతీ కార్యదర్శి యాదగిరిని 'సాక్షి' వివరణ కోరగా, ఇద్దరు వ్యక్తులు పంచాయతీ కార్యాలయ ధ్రువీకరణ పత్రాలు, రసీదులు తయారు చేసి తన సంతకం ఫోర్జరీ చేసింది నిజమేనని, పోలీసులకు ఫిర్యాదు చేశానన్నారు.

ఆశలు ఆవిరై.. జీవాలకు మేతై..

- నెర్రెలుబారిన భూములు.. ఎండుతున్న వరి, జొన్న పంటలు
- పశువులకు మేతగా మారుతున్న ఖైనం
- ఎత్తిపోతున్న వ్యవసాయ బోర్లు



శివాపూర్‌లో నీరు లేక నెర్రెలుబారిన భూమి



శివాపూర్ శివారులో ఎండుతున్న వరి

ఎల్లారెడ్డిరూరల్: చేతికందే దశలో పంటలు ఎండిపోతున్నాయి. భూగర్భ జలాలు అడుగంటుతుండడంతో బోర్లు ఎత్తిపోయి భూములు నెర్రెలు బారుతున్నాయి. ఎన్నో ఆశలతో సాగు చేసిన పంటపొలాలు పశువులకు మేతగా మారుతున్నాయి. ఎల్లారెడ్డి మండలంలోని 31 గ్రామ పంచాయతీల పరిధిలో 14 వేల ఎకరాల్లో రైతులు బోరుబావుల కింద, చెరువుల కింద యాసంగి పంటలు సాగు చేస్తున్నారు. మండలం పరిధిలో 20 వేల ఎకరాల సాగు భూమి ఉన్నప్పటికీ రైతులు 50 నుంచి 60 శాతం భూము ల్లో మాత్రమే పంటలను సాగు చేశారు. అత్యధికంగా 12 వేల ఎకరాల విస్తీర్ణంలో వరి, వెయ్యి ఎకరాల్లో జొన్న, మరో వెయ్యి ఎకరాల్లో మొక్కజొన్న, పెసర, మినుము, వేరుశనగ, శనగ సాగు చేశారు. చెరువుల కింద ఉన్న భూములకు సరిపడా నీరు అందుతున్నప్పటికీ, బోరుబావుల కింద పంటలు సాగు చేస్తున్న రైతుల పరిస్థితి అధ్వానంగా ఉంది. వరితోపాటు జొన్న, మొక్కజొన్న నీరందక ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఎండిన వరిని మేస్తున్న గొర్రెలు



శివాపూర్‌లో సన్నటిధార వస్తున్న బోరు

పశువులకు వదిలేశా



మూడు ఎకరాల భూమిలో రెండు ఎకరాలు మాత్రమే సాగు చేశా. యాసంగిలో రెండు ఎకరాలు వరి సాగు చేస్తే బోరుబావిలో నీరు తగ్గి పోవడంతో ఎకరాకు కూడా నీరు అందడం లేదు. దీంతో పంట ఎండిపోతోంది. ఎండిన పంటను పశువులకు మేతగా వదిలేశా. – శంకర్, రైతు, శివాపూర్

జొన్న ఎండిపోతోంది



యాసంగిలో వరికి నీరు ఎక్కువ అవసరం ఉంటుందని ఆరుతడి పంట అయిన జొన్న సాగు చేశా. ఎకరం జొన్నకు కూడా నీరందక ఎండిపోతోంది. ప్రభుత్వం ఎండుతున్న పంటలకు నష్టపరిహారం అందించి రైతులను ఆదుకోవాలి.
– కంబం సాయిలు, రైతు, శివాపూర్

క్లుప్తంగా

ఏఐ ఆధారిత ఎఫ్ఎల్ఎన్ అమలు చేయాలి

కామారెడ్డి టౌన్: మౌళిక భాషా గణిత సామర్థ్యాల సాధన (ఎఫ్ఎల్ఎన్ – ఫండమెంటల్ లిటరసీ అండ్ న్యూమరసీ)తో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ని జత చేయడం ద్వారా అద్భుత ఫలితాలు సాధించొచ్చని విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ యోగితారాణా అన్నారు. కలెక్టర్, డీఈవో, గుణాత్మక విద్య సమన్వయకర్తలతో గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. ప్రతి జిల్లాలో ఏఐ ఆధారిత ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమాన్ని ఖచ్చితంగా అమలు చేయాలని సూచించారు. వీసీ తరువాత కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాట్లాడుతూ.. జిల్లాలో 26 ప్రాథమిక పాఠశాలలను ఏఐ ఆధారిత ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమానికి ఎంపిక చేశామని తెలిపారు. ఆయా పాఠశాలల్లో ఏఐ క్స్ఎల్ ల్యాబ్‌లను ఈ నెల 15న ప్రారంభించనున్నామన్నారు. ఎంపిక చేసిన ప్రతి ప్రాథమిక పాఠశాల సమీపంలోని ఉన్నత పాఠశాల కంప్యూటర్ ల్యాబ్ ను ఉపయోగించుకొని ఒక ఉపాధ్యాయుడికి బాధ్యత అప్పగించి విద్యార్థులకు ఏఐ ఆధారిత విద్యాబోధన చేయాలని సూచించారు. ఇందుకు అవసరమైన మౌలిక సదుపాయాలను వెంటనే సమకూర్చుకొని ఎంపిక చేసిన పాఠశాలల్లో కార్యక్రమాన్ని ప్రారంభించాలని సూచించారు. హై స్పీడ్ ఇంటర్నెట్, విద్యార్థులకు హెడ్ ఫోన్స్ సమకూర్చుకుని కార్యక్రమాన్ని సమర్థంగా అమలు చేయాలని ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా విద్యాశాఖ అధికారి రాజు, గుణాత్మక విద్య సమన్వయకర్త వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

డీఎస్పీ కార్యాలయం తనిఖీ


మాట్లాడుతున్న ఎస్పీ రాజేశ్ చంద్ర

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని డీఎస్పీ కార్యాలయాన్ని గురువారం ఎస్పీ రాజేశ్ చంద్ర సందర్శించారు. కార్యాలయంలోని రికార్డులను పరిశీలించారు. సబ్ డివిజన్‌లోని పోలీస్ స్టేషన్‌లకు సంబంధించిన అధికారులు, సిబ్బంది వివరాలను ఏఎస్పీ చైతన్యారెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ఎస్పీ వెంట జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ తిరుపయ్య ఉన్నారు.

పంటల్ని నష్టపర్చకుండా చర్యలు చేపట్టాలి

- డీఎఫ్‌వోకు కిసాన్ సంఘ్ నాయకుల వినతి


వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

కామారెడ్డి అర్బన్: పంట చేలపై కోతులు, అడవి పందులు, జింకలు, నెమళ్లు పడి తీవ్ర నష్టం చేస్తున్నాయని, అటవీ సరిహద్దులకు కంచె వేసి జంతువులు పంటలపైకి రాకుండా చూడాలని, పంట నష్టపోయిన రైతులకు తగిన పరిహారం చెల్లించాలని భారతీయ కిసాన్ సంఘ్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం బీకేఎస్ జిల్లా అధ్యక్షుడు పి.విఠల్‌రెడ్డి ఆధ్వర్యంలో డీఎఫ్‌వో బి.నిఖితను కలిసి వినతి పత్రం అందజేశారు. వన్యప్రాణులను పంటలపైకి రాకుండా జాగ్రతలు తీసుకోవాలని, అటవీ అధికారులు స్పందించకపోతే జరిగే నష్టానికి రైతులు బాధ్యులుకారని డీఎఫ్‌వోకు స్పష్టం చేశారు. బీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనంద్‌రావు, సహ కార్యదర్శి కొమిరెడ్డి పెద్ద అంజన్న, తదితరులు పాల్గొన్నారు.

హోలీని సురక్షితంగా జరుపుకోవాలి

- శాంతి భద్రతలకు భంగం కలిగించొద్దు
- ఎస్పీ రాజేశ్ చంద్ర


ఎం రాజేశ్‌చంద్ర, ఎస్పీ, కామారెడ్డి

కామారెడ్డి క్రైం: హోలీ పండుగను జిల్లా ప్రజలు సంతోషంగా, సురక్షితంగా జరుపుకోవాలని ఎస్పీ రాజేష్ చంద్ర సూచించారు. గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. సోషల్ మీడియాలో వచ్చే అసత్య ప్రచారాలను నమ్మవద్దన్నారు. వేడుకలు జరుపుకొనే విషయంలో నిబంధనలు, సూచనల గురించి వివరించారు. ఆదేశాలను ఉల్లంఘించిన వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

పోలీసు శాఖ సూచనలు ..

- నేటి ఉదయం 6 గంటల నుండి మధ్యాహ్నం 12 వరకే హోలీ పండుగ జరుపుకోవాలి.
- హానికరమైన రసాయనాలున్న రంగులను వాడొద్దు.
- ఇష్టం లేని వ్యక్తులు, ప్రదేశాలు, వాహనాలపై రంగులు విసరడం కఠినంగా నిషేధం
- ప్రమాదకరమైన చర్యలకు పాల్పడొద్దు.. నీటి బెలూన్లు, గాజు పొడి కలిపిన రంగులు వాడొద్దు.
- ఎవరైనా తమ అనుమతి లేకుండా బలవంతంగా రంగులు పూయడం, శారీరక, మానసిక వేధింపులకు గురిచేయడం తీవ్రమైన నేరం.
- బహిరంగ ప్రదేశాల్లో ఇతరులను ఇబ్బంది పెట్టడం, మద్యం మత్తులో అల్లర్లు చేయడం నిషేధం.
- మద్యం సేవించి వాహనం నడపొద్దు.
- అత్యవసర పరిస్థితుల్లో 100 నంబర్‌కు కాల్ చేయండి.. ఏదైనా సమస్య ఉంటే వెంటనే పోలీసులకు సమాచారం అందించండి.
- సోషల్ మీడియా అసత్య ప్రచార పోస్టులను పెడితే కఠిన చర్యలు తీసుకుంటాం.
- చెరువులు, కుంటలలో లోతైన నీటిలోకి వెళ్లి ప్రమాదాల బారిన పడొద్దు.
- ప్రార్థనా మందిరాల వద్ద రంగులు చల్లవద్దు.
- తల్లిదండ్రులు తమ పిల్లల పట్ల జాగ్రత్తగా ఉండాలి.

నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు


పరిశీలిస్తున్న ఎస్పీ రాజేశ్ చంద్ర

కామారెడ్డి టౌన్: రోడ్డు ప్రమాదాల నివారణ కోసం వాహనదారులు తప్పకుండా ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని లేకుంటే చట్టపరమైన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ రాజేశ్ చంద్ర హెచ్చరించారు. గురువారం జిల్లా కేంద్రంలోని నిజాంసాగర్ చౌరస్తా, నరసన్నపల్లి చౌరస్తా వద్ద వాహనాల తనిఖీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ర్యాష్ డ్రైవింగ్, మైనర్లు వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. తప్పనిసరిగా హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ మద్యం సేవించి వాహనాలు నడపొద్దని, మైనర్లకు తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వవద్దని సూచించారు. పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఎస్సై తిరుపయ్య తదితరులున్నారు.

సమయపాలన పాటించకపోతే కఠిన చర్యలు

- వైద్యులు, స్టాఫ్‌నర్స్‌పై సబ్ కలెక్టర్ సీరియస్
- మద్నూర్ ఆస్పత్రి ఆకస్మిక తనిఖీ


మద్నూర్ ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న సబ్ కలెక్టర్

మద్నూర్(జుక్కల్): ప్రభుత్వ ఆస్పత్రిలో డ్యూటీలో ఒక్క డాక్టర్ కూడా లేకపోవడం ఏమిటని సబ్ కలెక్టర్ కిరణ్మయి ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని 30 పడకల ప్రభుత్వ ఆస్పత్రిని గురువారం బాన్సువాడ సబ్ కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలోకి వెళ్లగానే అక్కడే ఉన్న ఓపీ దగ్గర చిందరవందరగా పారేసిన సిరంజీలు, అపరిశుభ్రంగా ఉండటంపై స్టాఫ్ నర్స్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆస్పత్రిలోని అన్ని వార్డులలో సబ్ కలెక్టర్ తిరుగుతు ఆరా తీశారు. ఆస్పత్రిలో వైద్య సేవలు ఎలా అందుతున్నాయని రోగులను అడిగి తెలుసుకున్నారు. వైద్యులు సమయపాలన పాటించి సేవలు అందించాలని, లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. తహసీల్దార్ ముజీబ్, ఆస్పత్రి సూపరింటెండెంట్ జాదవ్, వైద్య సిబ్బంది ఉన్నారు.

పెండింగ్ ఫీజు బకాయిలు విడుదల చేయాలి


ఏవోకు వినతిపత్రం అందజేస్తున్న ఏబీవీపీ నాయకులు

కామారెడ్డి టౌన్: రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి సరిపడా నిధులు కేటాయించాలని కోరుతూ ఏబీవీపీ ఆధ్వర్యంలో గురువారం కలెక్టర్ కార్యాలయంలో ఏవో మసూర్ అహ్మద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యురాలు ప్రత్యూష రెడ్డి మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న ఫీజు రియింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ నిధుల బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. విద్యారంగంలో ఖాళీలను తక్షణమే భర్తీ చేయాలన్నారు. జిల్లా కన్వీనర్ రోహిత్, నాయకులు వెంకటేష్, అల్తాఫ్, పవన్, శశి, దత్తు, రాకేష్ తదితరులున్నారు.

పక్వానికి రాని పంటను కోయొద్దు


మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ విక్టర్

కామారెడ్డి టౌన్: పక్వానికి రాని పంటను కోయొద్దని అదనపు కలెక్టర్ విక్టర్ సూచించారు. రబీ వరి పంట కోతలు ప్రారంభవుతున్న సందర్భంగా గురువారం కలెక్టర్ కార్యాలయంలో అధికారులు, హార్వెస్టర్ యజమానులతో సమావేశం నిర్వహించారు. బ్లోయర్ 18–22 ఆర్‌పీఎంలు ఉంచాలని, గేర్ స్పాట్ ఏ1 నుంచి ఏ2లో ఉంచాలని వివరించారు. జిల్లాలో వరి కోత షెడ్యూల్ ప్రకారం హార్వెస్టర్ యజమానులు, డ్రైవర్లు వారి యంత్రాలను నిర్దేశించిన ప్రాంతాలలో ఉపయోగించాలని సూచించారు. అధికారుల ఆదేశాలను పాటించకుంటే చర్యలు తీసుకుంటామన్నారు. డీఏవో తిరుపతి ప్రసాద్, జిల్లా రవాణాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, పౌరసరఫరాల శాఖ అధికారి రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై ప్రజావేదిక


గాంధారిలో ప్రజావేదిక నిర్వహిస్తున్న అధికారులు

గాంధారి(ఎల్లారెడ్డి): స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఉపాధి పనులపై 15వ విడత ప్రజావేదిక కార్యక్రమాన్ని కామారెడ్డి డీఆర్‌డీవో సురేందర్ ఆధ్వర్యంలో గురువారం ప్రారంభించారు. ఏప్రిల్ 1, 2023 నుంచి మార్చి 31, 2024 వరకు మండల పరిధిలో జరిగిన ఉపాధి పనులపై గ్రామాల్లో సామాజిక తనిఖీ పూర్తి చేశారు. ప్రజావేదిక నిర్వహించారు. ఈ కాలంలో జరిగిన 272 పనులకు రూ. 3.04 కోట్లు చెల్లించినట్లు ఎంపీడీవో తెలిపారు. ఎస్పీఎం వేణు, క్యూసీ రాఘవన్, ఎస్ఆర్ మహేశ్వర్, ఎంపీడీవో రాజేశ్వర్, ఎంపీవో లక్ష్మీ నారాయణ, ఏపీఎం శృతి, ఈసీ గణేష్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ


హాజరైన అధికారులు, ప్రజాప్రతినిధులు

బీబీపేట:ఆదర్శ గ్రామం శివారు రాంరెడ్డిపల్లిలో గురువారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఇంటి నిర్మాణానికి కొలతలు వేసి ముగ్గు పోశారు. ప్రభుత్వం ఆదేశాల ప్రకారం ఇంటి నిర్మాణం చేసుకుంటే విడతల వారీగా డబ్బులు వస్తాయని,రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న రూ. 5 లక్షలు అందుతాయని ఎంపీడీవో పూర్ణచంద్రోదయకుమార్ సూచించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ పాత రాజు, సొసైటీ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సుతారి రమేశ్, ఎంపీవో అబ్బాగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలి


స్థానికులతో మాట్లాడుతున్న అధికారులు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): గ్రామాల్లో తాగునీటి ఎద్దడి రాకుండా చూడాలని నాగిరెడ్డిపేట ఎంపీడీవో ప్రభాకరచారి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాజ్‌కుమార్ సూచించారు. కొన్నిరోజులుగా గోపాల్‌పేటలోని ఎస్సీకాలనీకి సరిపడా తాగునీరు సరఫరా కావడం లేదని స్థానికులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. దీంతో గురువారం ఎస్సీ కాలనీలో తాగునీటి సరఫరాను వారు పరిశీలించారు. కాలనీకి సరిపడా నీటిని సరఫరా చేయించాలని పంచాయతీ కార్యదర్శి కిష్టయ్యకు సూచించారు. పైపులైన్ సమస్య ఉన్నచోట తవ్వించి సరిచేయించాలని వారు ఆదేశించారు.

రాజకీయ పార్టీలతో సమావేశాలు నిర్వహించాలి


వీసీలో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్


వీసీలో పాల్గొన్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి టౌన్: ఓటరు జాబితా, ఎన్నికల నిర్వహణ తదితర అంశాలపై చర్చించేందుకు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సి సుదర్శన్ అన్నారు. గురువారం వీడియోకాన్ఫరెన్స్ ద్వారా ఆయన మాట్లాడారు. జిల్లా ఎన్నికల అధికారురి అయిన కలెక్టర్‌తోపాటు ఈఆర్‌వోలు తమతమ స్థాయిలలో పొలిటికల్ పార్టీ మీటింగ్‌లు ఏర్పాటు చేసి అప్‌డేట్స్ అందించాలన్నారు. సమావేశాల తేదీ, సమయాన్ని ఖరారు చేస్తూ ముందస్తుగానే రాజకీయ పార్టీల ప్రతినిధులకు తెలపాలన్నారు. సమావేశంలో చర్చించిన అంశాలు, చేసిన తీర్మానాలను రిజిస్టర్లలో నమోదు చేయాలని, సమావేశాల వివరాలను సీఈవో కార్యాలయానికి, గుర్తింపు పొందిన పార్టీల ప్రధాన కార్యాలయాలకు సైతం పంపించాలని సూచించారు. కాగా, ఓటరు జాబితా సవరణకు సంబంధించి కొత్తగా వచ్చిన దరఖాస్తులను వెంటవెంటనే పరిశీలిస్తూ సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, అదనపు కలెక్టర్లు వి విక్టర్, డి శ్రీనివాస్‌రెడ్డి, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు సరళ, నాయబ్ తహసీల్దార్ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

శారీరకంగా, మానసికంగా ధృడంగా ఉండాలి


కౌన్సెలింగ్ సెంటర్ ప్రారంభించిన అనంతరం అధ్యాపకులతో సమావేశమైన జిల్లా వైద్య శాఖాధికారి

భిక్కనూరు: విద్యార్థులు శారీరకంగా, మానసికంగా ధృడంగా ఉంటే భవిష్యత్ బాగుంటుందని జిల్లా వైద్యశాఖాధికారి చంద్రశేఖర్ అన్నారు. తెలంగాణ యునివర్సిటీ సౌత్ క్యాంపస్ సోషల్ వర్క్ విభాగం , సూర్య ఆరోగ్య సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టూడెంట్ సపోర్ట్ కౌన్సెలింగ్ సెంటర్‌ను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు కౌన్సెలింగ్ సెంటర్ సేవలను సద్వినియోగం చేసుకుని గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు సేవలందించాలన్నారు. సూర్య హెల్త్ ఆర్గనైజేషన్ కో ఆర్డినేటర్ రాజేందర్ మాట్లాడుతూ.. విద్యార్థుల శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరిచే అన్ని వనరులను అందిస్తామన్నారు. యోగా, ఫిట్‌నెస్, తరగతులను హెల్త్ క్యాంపులను నిర్వహిస్తున్నామన్నారు. మానసిక వైద్య నిపుణుడు రవితేజ మాట్లాడుతూ.. నేటి సమాజంలో మానసిక ఆరోగ్యం ప్రధాన సమస్యగా ఉందన్నారు. ప్రేమతో మాట్లాడగలిగే వారందరూ కౌన్సెలర్ కావొచ్చన్నారు. ఉమ్మడి జిల్లాలో కల్తీ కల్లు 80శాతం మంది ప్రజలపై ప్రభావం చూపిస్తోందని దాంతో మానసిక ఆరోగ్యం నశిస్తోందన్నారు. కల్తీ కల్లుకు బానిసైన వారిని బయటపడేసే అవకాశం సోషల్ వర్క్ విద్యార్థులకు ఉంటుందన్నారు. జిల్లా మానసిక వైద్యాధికారి డాక్టర్ జి రమణ మాట్లాడుతూ.. మనకు వచ్చే ప్రతి భావోద్వేగాన్ని సమతుల్యంగా ఉంచుకుంటేనే మానసికంగా ఆరోగ్యంగా ఉన్నట్లన్నారు. ప్రిన్సిపాల్ సుధాకర్‌గౌడ్, వైస్ ప్రిన్సిపాల్ రాజేశ్వరి, సోషల్‌వర్క్ విభాగాదిపతి డాక్టర్ అంజయ్య, అధ్యాపకులు యాలాద్రి, నర్సయ్య, రమాదేవి, సరిత, నారాయణ,తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక వ్యవస్థకు దన్నుగా చిన్న పరిశ్రమలు


మాట్లాడుతున్న కె. విజయ్ కుమార్

కామారెడ్డి అర్బన్: దేశ సామాజిక, ఆర్థికాభివృద్ధిలో చిన్న, సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమల పాత్ర ఎంతో కీలకమైనవని ఐఈడీఎస్ ఏడీ రాజేశ్‌కుమార్, జిల్లా పరిశ్రమల అధికారి లాలూనాయక్, ఏడీ తులసీదాస్‌లు అన్నారు. గురువారం స్థానిక ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో జిల్లా పరిశ్రమల శాఖ చిన్న, సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమలు– ఉపాధి అవకాశాలపై వర్క్‌షాప్ నిర్వహించారు. ప్రజల జీవనప్రమాణాలు పెంచడంలో భారత ఆర్థిక వ్యవస్థకు చిన్నపరిశ్రమలు ఎంతో దన్నుగా నిలుస్తున్నాయని రిసోర్స్ పర్సన్స్ అన్నారు. ఆలోచన ఉంటే ఉపాధి ఉంటుందన్నారు. ప్రిన్సిపల్ విజయ్‌కుమార్, వైస్ ప్రిన్సిపల్ కిష్టయ్య, ప్రొఫెసర్ పుల్లయ్యలు మాట్లాడారు. అధ్యాపకులు సుధాకర్, సమన్వయకర్తలు విశ్వప్రసాద్, జయప్రకాష్, గణేష్, శ్రీనివాస్ రావు, ఫర్హీస్ ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణంపై ఇరువర్గాల మధ్య ఘర్షణ


విచారణ చేపట్టిన పోలీసులు

పెద్దకొడప్‌గల్(జుక్కల్): నూతన సీసీ రోడ్డు నిర్మాణ విషయంలో ఇరు వర్గాల మధ్య ఘర్షణ జరుగగా, ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని జగన్నాథ్‌పల్లి తండాలో గురువారం చోటుచేసుకుంది. తండావాసులు తెలిపిన వివరాలు ఇలా.. మండలంలోని జగన్నాథ్‌పల్లి గ్రామ పంచాయతీ పరిధిలో ఇటీవల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఈక్రమంలో రోడ్డు నిర్మాణ ప్రాంతంలో ఈ స్థలం తమది అంటే తమదని ఇరువర్గాల మధ్య ఘర్షణ ప్రారంభమైంది. రెండు వర్గాలవారు రెచ్చిపోయి ఇటుకలతో దాడి చేసుకున్నారు. ఈ ఘటనలో ఓ మహిళతోపాటు ముగ్గురు గాయపడ్డారు. స్థానికులు వెంటనే వారిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న ఎస్సై మహేందర్ ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేట్టారు. గాయపడ్డ హుషార్ సింగ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

క్రైం కార్నర్

168 డ్రంకన్‌డ్రైవ్ కేసులు నమోదు

ఖలీల్‌వాడి: నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో గత మూడు రోజుల వ్యవధిలో డ్రంకన్‌డ్రైవ్ తనిఖీల్లో 168 మంది పట్టుబడినట్లు పోలీస్ కమిషనర్ సాయిచైతన్య ఒక ప్రకటనలో వెల్లడించారు. వీరిపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చినట్లు తెలిపారు. ఎవరైనా మద్యం తాగి వాహనాలు నడిపి, పట్టుపడితే డ్రంకన్‌డ్రైవ్ కేసులు నమోదు చేసి, జైలుకు పంపిస్తామన్నారు.

మట్కా నిర్వాహకుడికి 2రోజుల జైలు

బోధన్: పట్టణంలో మట్కా నిర్వహిస్తున్న జమీల్ ఖాన్ అనే వ్యక్తిని పోలీసులు పట్టుకొని, బోధన్ కోర్టులో హాజరుపర్చారు. న్యాయమూర్తి అతడికి రెండు రోజుల జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధించారని టౌన్ సీఐ వెంకట నారాయణ తెలిపారు. అలాగే బహిరంగ ప్రదేశంలో మద్యం తాగిన వ్యక్తికి జడ్జి ఒక రోజు జైలుశిక్ష విధించారని అన్నారు.

ఇద్దరు గంజాయి విక్రేతల అరెస్ట్

ఖలీల్‌వాడి: గంజాయి అమ్ముతున్న ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు నార్త్ సీఐ బూక శ్రీనివాస్ తెలిపారు. నగరంలోని బాబన్ సాహెబ్ పహాడ్ వద్ద గురువారం ఉదయం ఎస్సై గంగాధర్ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా పల్సర్ బైక్‌పై వస్తున్న ఇద్దరు యువకులు పోలీసులను చూసి పారిపోతుండగా పట్టుకున్నారు. తనిఖీ చేసి, వారి నుంచి 390 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వారిలో ఒకరు నగరంలోని దొడ్డి కొమరయ్య కాలనీకి చెందిన హొనుశెట్టి రవి (25)గా, మరొకరు మహారాష్ట్రకు చెందిన సయ్యద్ జిలానీ(26)గా గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. నిందితులు నాందేడ్ ఏరియాలో గుర్తుతెలియని వ్యక్తుల దగ్గర గంజాయి కొనుగోలు చేసి అధిక డబ్బులు సంపాదించాలని ఉద్దేశంతో నిజామాబాద్ పరిసర ప్రాంత గ్రామాలలో అమ్ముతున్నట్లు విచారణలో తెలిసిందన్నారు.

ఆటో ఢీకొని వృద్ధుడి మృతి


పోచయ్య మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

ఎల్లారెడ్డి: హోలీ పండుగ సందర్భంగా గురువారం ఎల్లారెడ్డి మటన్ మార్కెట్‌కు వచ్చిన ఓ వృద్ధుడిని ఆటో ఢీకొనడంతో మృతిచెందాడు. ఎస్సై మహేష్ తెలిపిన వివరాలు ఇలా.. మండలంలోని సబ్దల్‌పూర్ గ్రామానికి చెందిన గడ్డం పోచయ్య (64) మటన్ కోసం ఎల్లారెడ్డికి వచ్చాడు. పట్టణంలోని గాంధీచౌక్ ప్రాంతంలో నడుచుకుంటూ వెళ్తుండగా అతడిని వెనక నుంచి ఆటో వచ్చి ఢీకొట్టింది. ఈఘటనలో అతడికి తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం హైదరాబాద్ తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

చెరువులో పడి వృద్ధురాలు..

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని ముంబోజిపేట గ్రామ శివారులోగల సింగయ్య చెరువులో ఓ వృద్ధురాలు పడి మృతిచెందినట్లు ఎస్సై వెంకట్రావు తెలిపారు. వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన మాదిగ కాశవ్వ(60) అనే వృద్ధురాలు నాలుగు రోజుల క్రితం బంధువుల ఇంటికి వెళ్లిపోయింది. తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు ఎంత వెతికినా ఆమె ఆచూకీ లభించలేదు. గురువారం భవానిపేట, ముంబోజిపేట శివారులోని సింగయ్య చెరువులో ఆమె మృతదేహం తేలింది. సమాచారం అందుకున్న పోలీసులు గ్రామానికి చేరుకొని వివరాలు సేకరించారు. ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతిచెందినట్లు కుటుంబ సభ్యుల ఫిర్యాదు కేసు నమోదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

మూడు ఇసుక ట్రాక్టర్ల సీజ్



మాచారెడ్డి: ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు మాచారెడ్డి ఎస్సై అనిల్ గురువారం తెలిపారు. పాల్వంచ మండలం బండ రామేశ్వర్‌పల్లి వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారన్న సమాచారం మేరకు తాము పెట్రోలింగ్ నిర్వహించామన్నారు. అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకుని సీజ్ చేసి కేసు నమోదు చేశామని, వాహనాలను పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై వివరించారు.

బిచ్కుందలో రేషన్ షాపు..


షాపును సీజ్ చేస్తున్న అధికారులు

బిచ్కుంద(జుక్కల్): మండల కేంద్రంలోని రేషన్ షాపు డీలర్ అక్రమాలకు పాల్పడటంతో దుకాణాన్ని సీజ్ చేసినట్లు ఆర్‌ఐ రవిందర్ గురువారం తెలిపారు. రేషన్ బియ్యంను ప్రజలకు పంపిణీ చేయకుండా అక్రమాలకు పాల్పడ్డాడని ఫిర్యాదు రావడంతో తహసీల్దార్ ఆదేశాల మేరకు షాపులో తనిఖీ చేశామన్నారు. విచారణ చేపట్టడంతో అక్రమాలకు పాల్పడినట్లు తేలడంతో షాపును సీజ్ చేసినట్లు తెలిపారు.

హత్యకేసులో ఒకరికి జీవితఖైదు

కామారెడ్డి క్రైం: హత్యకేసులో ఒకరికి జీవితఖైదు శిక్షను విధిస్తూ కామారెడ్డి కోర్టు ప్రధాన న్యాయ మూర్తి వివిఆర్ఆర్ ప్రసాద్ గురువారం తీర్పు వెల్లడించారు. వివరాలు ఇలా.. నాగిరెడ్డిపేట మండలం మాల్తుమ్మెద గ్రామానికి చెందిన కర్రే రామకృష్ణయ్య, కర్రే రాజయ్య మధ్య గత కొన్నేళ్లుగా భూ తగాదాలు నడిచాయి. 2020 అక్టోబర్ 17న రామకృష్ణయ్య తన భార్య బాలమణి, కొడుకు ప్రవీణ్‌తో కలిసి రాజయ్య ఇంటికి వెళ్లి పెద్దమనుషుల సమక్షంలో మాట్లాడారు. రాజయ్య అకారణంగా కర్రతో రామకృష్ణయ్య తల, నడుంపై బలంగా కొట్టాడు. వెంటనే కుటుంబసభ్యులు అతడిని చికిత్స నిమిత్తం ఎల్లారెడ్డి ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి కామారెడ్డి ఆస్పత్రికి తరలించగా చికిత్సపొందుతూ మరణించాడు. మృతుడి భార్య బాలమణి ఫిర్యాదు మేరకు నాగిరెడ్డిపేట పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు. కోర్టులో నేరం రుజువు కావడంతో నేరస్తుడు రాజయ్యకు జీవితఖైదు, రూ.10వేల జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు ఇచ్చారు. ఎల్లారెడ్డి సీఐ రాజశేఖర్, ఏఎస్సై సుబ్రమణ్యాచారి, పీపీ రాజగోపాల్‌గౌడ్, ప్రస్తుత సీఐ రవీంద్రనాయక్, ఎస్సై మల్లారెడ్డి, కోర్టు లైజనింగ్ ఆఫీసర్ ఎస్సై మురళి, కానిస్టేబుల్ సాయిలును ఎస్పీ రాజేశ్‌చంద్ర అభినందించారు.

ఇస్రోజీవాడిలో ఒకరి ఆత్మహత్య

కామారెడ్డి క్రైం: కామారెడ్డి మండలం ఇస్రోజీవాడి గ్రామంలో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన చెట్కూరి దేవయ్య (55) వ్యవసాయం చేసుకుంటు, జీవనం సాగించేవాడు. గురువారం ఉదయం పొలానికి వెళ్లిన అతడు అక్కడే ఓ చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న దేవునిపల్లి పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని, విచారణ జరిపారు. దేవయ్య చాలా రోజులుగా కడుపునొప్పితో బాధపడేవాడనీ, ఎన్ని మందులు వాడినా తగ్గలేదని అతడి భార్య భాగవ్వ తెలిపారు. కడుపునొప్పి భరించలేకనే ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రాజు వెల్లడించారు.

వ్యక్తి పుర్రె, ఎముకలు లభ్యం


లభ్యమైన పుర్రె, ఎముకలు

నవీపేట: మండలంలోని బినోల శివారులో గురువారం మానవ మృత కళేబరాలు లభ్యమైనట్లు ఎస్సై వినయ్ తెలిపారు. ఘటన స్థలంలో పుర్రె, ఎముకలు, దుస్తువుల ఆనవాళ్లు వేర్వేరుగా పడి ఉన్నాయన్నారు. కొన్ని నెలల కిందట వ్యక్తి చనిపోయి ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేశారు. గాంధీనగర్ కారోబార్ మురళి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పేకాడుతున్న 10మంది అరెస్టు

ఖలీల్‌వాడి: నగరంలోని వీక్లీబజార్, ముదిరాజ్ గల్లీలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై దాడి చేసి, పేకాడుతున్న 10మందిని అదుపులోకి తీసుకున్నట్లు టాస్క్ ఫోర్స్ సీఐ అంజయ్య గురువారం తెలిపారు. అలాగే వారి వద్ద నుంచి 10 సెల్‌ఫోన్లు, రూ. 66,410 నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. తదుపరి చర్య నిమిత్తం కేసును వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతికి అప్పగించినట్లు తెలిపారు.